క్లుప్తంగా

వికాస చిన్నారులకు అండగా ఉంటా



దుస్తులు అందజేస్తున్న రాంచంద్రంయాదవ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): వికాస పిల్లలకు అండగా ఉంటూ 17యేళ్లుగా పండుగకు నూతన వస్త్రాలు అందిస్తున్నానని మాజీ జెడ్పీటీసీ రామ చంద్రంయాదవ్ తెలిపారు. మండలంలోని అలిరాజపేటలో మంగళవారం ఎస్‌సీవీ రోజ్ సంస్థలోని వికాస పిల్లలకు దుస్తులు, వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయడంలోఎంతో సంతృప్తిని కలిగిస్తుందని, పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్‌సీవీ రోజ్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు క్యాథలిన్, సవిత, మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్‌లు శ్వేత, స్వాతి, ఫాదర్ అనిల్, సామాజిక కార్యకర్తలు కృష్ణమూర్తి, నర్సింహులు, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు



స్థలాన్ని చదును చేయిస్తున్న సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్: మండలంలో గురువారం జరుపుకోనే సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు పల్లె చెరువు కట్టలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వీధుల్లో చెత్త లేకుండా తొలగించి చెరువు కట్టల దగ్గర బతుకమ్మలు ఆడేందుకు స్థలాలను సదను చేశారు.

నంగునూరులో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు



కవాతు చేస్తున్న కార్యకర్తలు

నంగునూరు(సిద్దిపేట): భారతదేశం విశ్వ గురువుగా నిలుస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ విభాగ్ సహకార్యవాహ నర్సింహులు అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం నంగునూరులో స్వయం సేవకులు కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, సంప్రదాయాలను కాపాడేందుకు డాక్టర్ కేశవ బలిరామ్ హేగ్డే ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారన్నారు. కార్యక్రమంలో జిల్లా సంపర్క్ ముదిగంటి రవీందర్‌రెడ్డి, కార్యవాహ వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, రజినీకర్‌రెడ్డి, నరేందర్, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల వినూత్న నిరసన



బతుకమ్మ ఆడుతున్న ఆశా కార్యకర్తలు

బెజ్జంకి(సిద్దిపేట): వేతనాలు పెంచి, తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు మంగళవారం బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని కార్యక్రమాల్లోను భాగస్వాములం అయ్యామన్నారు. 20 యేళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్దకోడూరులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పల్లె లక్ష్మణ్‌కు చెందిన పాడిగేదె తన పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు. రూ.50వేల విలువైన పాడి గేదె మృతి చెందడంతో రైతు లక్ష్మణ్ బోరున విలపించాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

మహాలక్ష్మిగా దుర్గామాత

దేవి నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా దుర్గామాత ఆలయాలు, మండపాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గామాత సన్నిధిలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.



దుబ్బాకటౌన్: దుబ్బాకలో..



కొండపాక(గజ్వేల్): మహాలక్ష్మిగా దుర్గామాత



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం



హుస్నాబాద్: మహిళల కుంకుమార్చన



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కరెన్సీ నోట్ల అలంకరణలో



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): లింగారెడ్డి పల్లిలో...



చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచలో పూజలు నిర్వహిస్తున్న వంగ రాజేశ్వర్ రెడ్డి



గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్‌లో..

సందడిగా బతుకమ్మ సంబరాలు

జిల్లాలో బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. రంగురంగుల పూలతో పట్టణాలు, గ్రామాలు కళకళలాడుతున్నాయి. మంగళవారం ఏడో రోజున బతుకమ్మ సంబరాలను మహిళలు, యువతులు వేడుకగా నిర్వహించారు. తీరొక్క పువ్వులతో పేర్చి.. ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కొమురవెల్లి(సిద్దిపేట): తపాస్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిద్దిపేటజోన్: రైతు బజార్ వద్ద..



కొండపాక(గజ్వేల్): కొండపాకలో..

కాంగ్రెస్ జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలో చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణ కేంద్రానికి చెందిన పుర్మ ఆగంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడుగా కొమురవెల్లి మండలం అయినాపూర్‌కు చెందిన మెర్గు శ్రీనివాస్‌గౌడ్‌కు చోటు కల్పించడంతో పాటు చేర్యాల బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా వీరన్నపేటకు చెందిన మంజె మల్లేశంను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ప్రకటించారు. సంబంధిత నియామక పత్రాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తమను నియమించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రం అందజేస్తున్న కొమ్మూరి

బాధితులకు పరామర్శ

మండల పరిధిలోని నాగపురికి చెందిన వీఆర్వో నర్సింహారెడ్డి భార్య సుగుణ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారి ఇంటికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కొమ్ము రవి, ఆగంరెడ్డి, బాబు, శ్రీను, మహేశ్, నర్సింహులు, సుధాకర్, యాదగిరి తదితరులున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. బోడుగం వరలక్ష్మి అధ్యక్షతన మర్రిముచ్చాల గ్రామశాఖ మహాసభను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎన్నికల తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమయిందని ఆరోపించారు. సత్తిరెడ్డి, యాదవరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి(సిద్దిపేట): మాట్లాడుతున్న మల్లారెడ్డి

కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలి

మర్కుక్(గజ్వేల్): పరిశ్రమల్లో కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. మర్కుక్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కరకపట్ల, ములుగు, గజ్వేల్, వర్గల్ మండలాల పరిధిలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, పర్మినెంట్, క్యాజువల్ కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా బోనస్ రూ.7వేలు లేదా 8.33శాతం లాభాల్లో ఉన్న పరిశ్రమల్లో 20శాతం వర్తింపజేయాలని కోరారు. నాయకులు బాల్‌లక్ష్మి, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లకుంట చెరువును కాపాడాలని వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లోని తాళ్లకుంట చెరువును కాపాడాలని గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులతో కలసి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన ఇరిగేషన్ ఈఈతో ఫోన్లో మాట్లాడారు. తాళ్ల చెరువును సర్వేచేసి, హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, రమణారెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, బాలయ్య, శ్రీనివాస్, ఆగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 మందిపై కేసు

సిద్దిపేటకమాన్: దాబాలో న్యూసెన్స్ చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పీఎస్ పరిధిలోని దాబాలలో తమ సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఓ దాబాలో న్యూసెన్స్ చేస్తున్న 9మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో నలుగురు వాహనదారులు పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా రూ.8వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌నగర్, గణేశ్‌నగర్, శ్రీనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లోను, హరిప్రియనగర్, హనుమాన్‌నగర్, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన కోరారు.

విద్యాధరి సేవలో ఎంపీ రఘునందన్



అమ్మవారి సన్నిధిలో రఘునందన్‌రావు

వర్గల్(గజ్వేల్): మహాలక్ష్మిదేవి అలంకారంలో కొలువుదీరిన వర్గల్ సరస్వతి అమ్మవారిని మంగళవారం ఎంపీ రఘునందన్‌రావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించి ఆశీస్సులు పొందారు. ఆలయ పండితులు ఆయనకు శేషవస్త్రం అందజేసి ఘనంగా సన్మానించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు దరం గురువారెడ్డి, రాంరెడ్డి తదితరులున్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో స్థానం

మర్కూక్(గజ్వేల్): పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో మర్కూక్ మండల ఉపాధ్యాయులకు ప్రాధాన్యం కల్పించడం అభినందనీయమని ఆ సంఘం నాయకులు తెలిపారు. 2024–26 సంవత్సరానికి గాను శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లిలో జరిగిన నూతన ఎంపికలో అసోసియేట్ అధ్యక్షులుగా కొత్త నరేందర్‌రెడ్డి, జి.కూచిరెడ్డి, కె.నర్సింహులు, ఆర్.రామకృష్ణారెడ్డి, ఎండీ షాబొద్దీన్, రజితరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎ.సరితాదేవి, యాదిరెడ్డి, యు.గణేశ్, కె.శ్రీధర్ ఎంపికవడంపై మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, తుమ్మ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరుతూ తీర్మానాలు చేశారన్నారు. కార్యక్రమంలో బాలకిషన్, రమణారావు, వెంకటేశ్వర్‌రెడ్డి, కేశవరెడ్డి, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

అంతర పంటలతో అధిక ఆదాయం

అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్

సిద్దిపేట అర్బన్: అంతర పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ చెప్పారు. అర్బన్ మండలం మిట్టపల్లిలో మామిండ్ల యాదగిరి తన పొలంలో కంది పంటలో అంతర పంటగా సాగుచేసిన రాగి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అంతర పంటలు సాగుచేయడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో ఒక పంట నష్ట పోయినా మరో పంట దిగుబడితో నష్టాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. అలాగే వరి పొలాలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఆయన వెంట పవన్, రాజేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

గజ్వేల్‌రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు అదనపు సీఐ ముత్యంరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జార్ఖండ్‌కు చెందిన దీపక్ చంద్రవంశీ గత నెల 17న సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశాడని, సీఈఐఆర్ టెక్నాలజీ సాయంతో ఫోన్‌ను గుర్తించామని చెప్పారు. ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోహెడ(హుస్నాబాద్): గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ అభిలాష్ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన బస్వరాజు మైసయ్య(44) గత నెల 18న కూల్ డ్రింక్‌లో గడ్డిమందు కలుపుకొని తాగాడు. ఇంట్లో వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం 22న హైదరాబాద్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య యాదవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ నాలుగు వాహనాలు ఢీ

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై మూడు వాహనాలు వెనుక నుంచి మరొకటి ఢీ కొన్న ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. సిద్దిపేట వైపు నుంచి బీఆర్‌ఎస్ నాయకుడు ర్యాగల్ల దుర్గయ్య అతడి స్నేహితుడితో కలిసి తన కారులో కుకునూరుపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఓ డీసీఎం వాహనం ముందు వెళ్తున్న వారి వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో వెనుకనే వస్తున్న ఆర్టీసీ బస్సు డీసీఎంను ఢీకొట్టి నిలిచిపోగా దాని వెనుక వస్తున్న మరో వాహనం ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. వరుసగా నాలుగు వాహనాలు ఢీకొనగా ఎవరూ గాయపడ లేదు. ర్యాగల్ల దుర్గయ్య ఫిర్యాదు మేరకు డీసీఎం వాహన డ్రైవరు వనపర్తి జిల్లా మీదిగట్ల గ్రామానికి చెందిన ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

◆ అనంతరెడ్డికి మద్దతు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనంతరెడ్డికి తాము మద్దతు ఇస్తామని సిద్దిపేట ప్రైవేట్ స్కూల్ నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న అనంతరెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటును తనకువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేశ్ కుమార్, చిన్న, సంజీవరెడ్డి, సంతోష్ కుమార్, నవీన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ పంచాయతీ కార్మికులకు దుస్తులు

తొగుట(దుబ్బాక): బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా మండల పరిధిలోని వెంకట్రావుపేటలో పంచాయతీ కార్మికులకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సురేశ్, బాలేశ్, గణేశ్, కిష్టయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): సమయపాలన పాటించని పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అబ్బుల బాలాగౌడ్ డిమాండ్ చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ భూంపల్లి పీహెచ్‌సీలో కనీసం సిరంజులు లేవంటూ రోగులను బయటకు పంపిస్తున్నారని ఆరోపించారు. సాయంత్రం నాలుగు గంటల వరకే వెళ్ళిపోతుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): సిద్దిపేటలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న బీసీలపై అనుచిత వాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆజాద్ యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దాల శ్రీనివాస్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు.

◆ కాంగ్రెస్ నాయకుల పరామర్శ


తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని జప్తిలింగారెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యెన్నం మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుమారులైన పీఏసీఎస్ డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా నాయకుడు చెరుకు విజయ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట కొండల్‌రెడ్డి, మల్లయ్య, కనకయ్య, చంద్రయ్య ఉన్నారు.

◆ బీజేపీ నేతల సంబురాలు

గజ్వేల్‌రూరల్: హర్యానాలో బీజేపీ గెలుపొందడంపై గజ్వేల్‌లో ఆ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద మంగళవారం పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జశ్వంత్‌రెడ్డి, సందీప్, మహిళా నాయకులు కలిసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నర్సింహ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని కాన్గల్, వెంకట్రావుపేటలో లబ్ధిదారులకు మాజీ వైస్ ఎంపీపీ



శ్రీకాంత్ రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు కనకయ్య, భాస్కర్‌రెడ్డి, స్వామి గౌడ్, పరశురాములు, వెంకటయ్య పాల్గొన్నారు.